**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

బ్రతుకునివ్వుమనుచు బతుకమ్మల కొలచి
పడుతులంత జేరి వలయముగను
పాడియాడిరంట పరవశముననిట
చూడముచ్చటయ్యె చూపరులకు

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు
---------------------

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**| విలేకరులు కావలెను |**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 167 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 22-9-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00

# నేటి నుంచే కొత్త జీఎస్టీ..

- ఇక నుంచి రెండు శ్లాబులే
- 5, 18 శాతాలు మాత్రమే
- సిన్ గూడ్స్‌పై మాత్రం 40%



**న్యూఢిల్లీ**

సవరించిన జీఎస్టీ శ్లాబ్‌ల ధరలు దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమలులోకి వస్తున్నాయి. ఇక నుంచి 5, 18 శాతం క్యాటగిరీలే ఉంటాయి. అయితే కొన్ని లగ్జరీ, సిన్ (హానికర) గూడ్స్‌ను 40 శాతం శ్లాబ్ పరిధిలోకి తెస్తారు. చాలా వరకు నిత్యావసర వస్తువులను 5 శాతం పరిధిలోకి, ఇతర వస్తువులు, సేవలను 18 శాతం పరిధిలోకి చేర్చారు. పొగాకు, ఆల్కహాల్, బెట్టింగ్, ఆన్‌లైన్‌గేమింగ్ వంటి సిన్ గూడ్స్‌ను 40 శాతం పరిధిలోకి తెచ్చారు.5 శాతం పరిధిలోకి వచ్చేవి: నెయ్యి, పన్నీరు, డ్రైఫ్రూట్‌లు, బిస్కట్లు, జామ్, కెచప్‌లు, నామ్‌కీన్‌టూత్ పేస్ట్‌లు, సబ్బులు, షాంపూలు -మిగతా 2 లో

# ఫిలిప్పీన్స్‌లో 'నేపాల్' తరహా నిరసనలు

- ప్రభుత్వ అవినీతిపై వెల్లువెత్తిన ఆగ్రహం



**మనీలా**

నేపాల్‌లో ప్రభుత్వ అవినీతిపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం.. ఇప్పుడు ఫిలిప్పీన్స్‌ను తాకింది. ప్రభుత్వ అవినీతి బాగోతాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం దేశ రాజధాని మనీలాలో ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. వారిని నియంత్రించడానికి పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించాల్సి వచ్చింది.వరద నియంత్రణ ప్రాజెక్టుల కోసం కేటాయించిన భారీ మొత్తంలోని(సుమారుగా రూ.83 వేల కోట్లు) డబ్బు.. ప్రభుత్వ పెద్దలు, అధికారులు, బడా వ్యాపారుల జేబుల్లోకి వెళ్లిందన్న ఆరోపణలు ప్రభుత్వాన్ని కుదిపేస్తున్నాయి.



# పాలస్తీనా దేశమే..

- గుర్తించిన బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా

**లండన్**

బ్రిటన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అమెరికా, ఇజ్రాయిల్‌ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ.. పాలస్తీనా ను అధికారికంగా దేశంగా గుర్తించింది. బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ ఈ విషయాన్ని ప్రకటించారు. పాలస్తీనీయులు, ఇజ్రాయిల్ పౌరుల్లో శాంతిస్థాపన ఆశలను పునరుద్ధరించేందుకు, ద్విదేశ పరిష్కారం కోసం ఈమేరకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కెనడా, ఆస్ట్రేలియాలు సైతం ఈమేరకు ప్రకటన చేశాయి. -మిగతా 2 లో

# స్వదేశీ వస్తువులే వాడండి

- ఒకప్పుడు దేశ తయారీ, నాణ్యత ఉన్నతమైనవి
- ఆ వైభవాన్ని తిరిగి పొందాలి
- స్వావలంబన మంత్రంతో ముందుకు సాగాలి : ప్రధాని మోడీ
- నేటి నుంచి జీఎస్టీ బచత్ ఉత్సవ్ ప్రారంభం



2 లో

# రాష్ట్రమంతా సౌభాగ్యంగా ఉండాలి

## వరంగల్‌లో బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి, జూపల్లి
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రులు

**హనుమకొండ**

ప్రకృతిలో లభించే అనేక రకాల పూలతో తొమ్మిది రోజులపాటు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజిస్తారని, వారి పూజలు ఫలప్రదమై రాష్ట్రంతో పాటు రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రాత్రి తెలంగాణ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో కాకతీయ నృత్య ప్రదర్శనతో పాటు వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగ ప్రారంభం అయిందని అన్నారు. -మిగతా 2 లో






# సిద్దిపేట ఎవరి జాగీరు కాదు

- ఎన్ని ఆంక్షలు పెడితే అన్నిసార్లు వస్తా
- తల్లీబిడ్డను ఎడబాపారు..
- చంద్రుడు లాంటి కేసీఆర్‌కు మచ్చ తెచ్చారు
- చింతమడక ఇచ్చిన ధైర్యంతో ముందుకు వెళ్తున్న..
- కన్న ఊరు భవిష్యత్తులో కర్మ భూమి కావొచ్చు
- చింతమడక బతుకమ్మ సంబురాల్లో కవిత ఘాటు వ్యాఖ్యలు
- కుటుంబంలో చిచ్చు పెట్టిన వారిని వదిలిపెట్టనంటూ హెచ్చరికలు
- భావోద్వేగంతో కంటతడి..

**సిద్దిపేట**

'సిద్దిపేట, చింతమడక ఎవరి జాగీరు కాదు.. ఎన్ని ఆంక్షలు పెడితే అన్నిసార్లు వస్తా.. తాటతీస్తా..' అంటూ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. 'తల్లీబిడ్డను ఎడబాపారు.. చంద్రుడు లాంటి కేసీఆర్‌కు మచ్చ తెచ్చారు' అంటూ భావోద్వేగంతో కంటతడి పెట్టారు. సిద్దిపేట రూరల్ మండలంలోని మాజీ సీఎం కేసీఆర్ స్వగ్రామమైన చింతమడక గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంగిలిపూల బతుకమ్మ సంబురాల్లో ఆదివారం ఆమె పాల్గొన్నారు. ముందుగా రాఘవ పూర్ వద్ద గ్రామస్తులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. -మిగతా 2 లో





# చెరువును కెమికల్స్ తో నింపేసిన హెటిరో కెమికల్ కంపెనీ

## హెటీరో వ్యర్థాలతో గ్రామాల జీవనాధారం బూడిద"

"ఎరుపెక్కిన చెరువులు... ఎండిపోయిన భూములు"
"మరణాన్ని మోసుకొస్తున్న పరిశ్రమ వ్యర్థాలు"

- "పంటలు, చేపలు చనిపోయాయి ప్రజల ప్రాణాలే పణంగా"
- చెరువులు ఎరుపు రంగులోకి మారిపోయినా అధికారులు మౌనం ఎందుకు?
- కాలుష్యం వల్ల పంటలు, చేపలు నాశనం పరిహారం ఎవరు ఇస్తారు?
- ఎయిర్‌ఫోర్స్ ల్యాండ్లో వ్యర్థాలు పూడ్చిపెడుతుంటే కేంద్రం ఎందుకు స్పందించడం లేదు?
- పీసీబీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఎవరి కోసం పనిచేస్తున్నాయి?
- "నీలగిరి ఎక్స్ ప్రెస్ " ఇన్వెస్టిగేషన్ ఎక్స్ క్లూజివ్ ( సబ్ ఎడిటర్ అలేటి నవీన్

**హైదరాబాద్ సెప్టెంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

పటాన్‌చెరు నియోజకవర్గం గొమ్మడిదల మండలంలోని దోమడుగు, బంతపల్లి గ్రామాలు కీమికల్ కాలుష్య బారిన పడి జీవనాధారం కోల్పోతున్నాయి. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల ఆధారంగా నీలగిరి ఎక్స్ ప్రెస్ ప్రతినిధి అక్కడ ప్రత్యేకంగా సందర్శించి అక్కడ జరుగున్న అక్రమాల గురించి ఇన్వెస్టిగేషన్ చేయగా భయానక పరిస్థితిని తలపించేలా నిజాలు వెలుగులోకి వచ్చాయి. హెటీరో డ్రగ్ యూనిట్ నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలు చెరువుల్లోకి చేరుతుండటంతో నీరు ఎరుపు, గులాబీ రంగులోకి మారిపోయింది. దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు పూర్తిగా విషపూరితమైంది. చెరువు నీరు సాగునీటిగా వాడే వేల ఎకరాల -మిగతా 2 లో







# పాలస్తీనా దేశమే..

(మొదటి తరువాయి)

గాజాలో కాల్పుల విరమణకు, ఐరాస సాయం అనుమతికి, దీర్ఘకాలిక శాంతికి ఇజ్రాయిల్ అంగీకరించకపోతే.. పాలస్తీనాను దేశంగా గుర్తిస్తా మని జులైలోనే స్టార్మర్ ప్రకటించారు. ఇటీవల బ్రిటన్ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్టార్మర్ ప్రభుత్వ ప్రణాళిక లను వ్యతిరేకించారు. ఈ విషయంలో ప్రధాని స్టార్మర్ తో విభేదాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు 140కి పైగా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. త్వరలోనే ఫ్రాన్స్ తదితర దేశాలూ ఈమేరకు ప్రకటనలు చేయనున్నట్లు సమాచారం.

**ఏమిటీ ద్విదేశ పరిష్కారం**

పాలస్తీనాను దేశంగా గుర్తించే విషయంలో బ్రిటన్ తదితర దేశాల ప్రణాళికలను అమెరికా, ఇజ్రాయిల్ దేశాల ప్రతినిధులు ఇప్పటికే ఖండించారు. ఉగ్రవాదంతోపాటు 2023 అక్టోబరు 7నాటి దాడుల విషయంలో హమాస్‌కు బ్రిటన్ బహుమతి ఇచ్చినట్టు ఇజ్రాయిల్ విదేశాంగశాఖ విమర్శించింది.

**ఇజ్రాయిల్ దాడుల్లో 55 మంది మృతి**

ఆదివారం ఉదయం నుంచి గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 55 మంది పాలస్తీయన్లు మరణించారు. గాజా నగరంలోనే 37 మంది చనిపోయినట్టు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. మరోవైపు ఆకలికోరల్లో చిక్కి మరో చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆకలితో చనిపోయిన వారి సంఖ్య మరింతగా అధికమవుతోంది. దీనిపై పౌర హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తరచేస్తున్నాయి

## రాష్ట్రమంతా సౌభాగ్యంగా ఉండాలి

(మొదటి తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల ఫలవంతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మహిళలంతా ఆర్థికంగా ఎదగడంతో పాటు శక్తివంతులుగా ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆడపడుచులకు అందరికీ బతుకమ్మ పండుగ శు భాకాంక్షలు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్వయంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటల సీడీని మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజ్, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశీ వస్తువులే వాడండి

ఒకప్పుడు దేశ తయారీ, నాణ్యత ఉన్నతమైనవి
ఆ వైభవాన్ని తిరిగి పొందాలి
స్వావలంబన మంత్రంతో ముందుకు సాగాలి : ప్రధాని మోడీ
నేటి నుంచి జీఎస్టీ బచత్ ఉత్సవ్ ప్రారంభం



**న్యూఢిల్లీ**

జీఎస్టీ సంస్కరణలు దేశ వృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. గతంలో దేశ తయారీ, నాణ్యత ఉన్నతంగా ఉండేవని, ఆ వైభవాన్ని తిరిగి పొందాలని ఆయన చెప్పారు. ఆదివారం ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. నేటి నుంచి 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' ప్రారంభమవుతుండడంతో ప్రధాని మోడీ స్వదేశీని స్వీకరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. స్వావలంభన మంత్రంతో ముందుకు సాగాలని ప్రజలకు సూచించారు. దేశ ప్రజలకు ఏది అవసరమో.. దేశీయంగా ఏం తయారు చేయగలమో దాన్ని దేశీయంగానే తయారు చేయాలని పిలుపునిచ్చారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు, నియమాలు, నిబంధనలు, విధానాల సరళీకరణతో ఎంఎస్ఎంఈలు, చిన్న తరహా, కుటీర పరిశ్రమలు ఎంతో ప్రయోజనం పొందుతాయన్నారు. అమ్మకాలు సైతం పెరుగుతాయన్నారు. వాటి పై తక్కువ పన్ను చెల్లించాల్సి ఉంటుం దన్నారు. దేశ శ్రేయస్సు శిఖరాగ్రంలో ఉన్నప్పుడు చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవన్నారు. మన పరిశ్రమలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండాలని, మనం ఉత్పత్తి చేసే వస్తువులు ప్రపంచంలోని అత్యుత్తమ ప్రమాణాలను అధిగమించాలని పిలుపునిచ్చారు. గత 11 ఏండ్లలో 250 మిలియన్ల మంది ప్రజలు పేదరికాన్ని అధిగమించారని తెలిపారు. 1.2 మిలియన్ల వరకు ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపులు మధ్య తరగతికి గణనీయమైన ఉపశమనాన్ని అందించాయన్నారు.జీఎస్టీ సంస్కరణలు గృహ నిర్మాణం, స్కూటర్లు, కార్లు, హెూటల్స్ వంటి ఖర్చులను తగ్గిస్తాయన్నారు. పేదలు, నవ మధ్యతరగతి రెండింతలు ప్రయోజనం పొందుతారని ఆయన వెల్లడించారు. వివిధ రాష్ట్రాల్లో పన్నులు, టోల్‌ల సంక్లిష్టతల నుంచి విముక్తి కంపెనీలకు ఒక సవాలుగా ఉందన్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వస్తువులను రవాణా చేయడం చాలా కష్టంగా ఉందని, కంపెనీలు యూరప్‌కు రవాణా చేయడానికి ఇష్టపడతాయన్నారు. కొత్త సంస్క రణలు వ్యాపారాన్ని సులభతరం చేస్తాయని, వినియోగదారులపై భారాన్ని తగ్గిస్తా యని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు పెట్టుబడులను ఆకర్షిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అభివృద్ధి పథంలో ప్రతీ రాష్ట్రాన్ని సమానంగా కలుపుతాయని వెల్లడించారు. 2017లో జీఎస్టీ అమలు ఒక చారిత్రాత్మక అడుగు అని, ఇప్పుడు కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని తెలిపారు. పేదలు, మధ్యతరగతి, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యవస్థాపకులు అందరూ ఈ సంస్కరణ లతో ప్రయోజనం పొందుతారన్నారు. కొత్త తరం జీఎస్టీ సంస్కరణలు 'నాగరిక దేవో భవ'ను ప్రతిబింబిస్తాయన్నారు.నవరాత్రి మొదటి రోజు నుంచి ఆత్మనిర్భర్ భారత్ వైపు దేశం అడుగులు వేస్తుందన్నారు. వన్ నేషన్ వన్ ట్యాక్స్ కల సాకారమైందని అన్నారు. ఐటీ మినహాయింపు పరిమితి పెంపు, జీఎస్టీ సంస్కర ణలు ప్రజలకు రూ. 2.5 లక్షల కోట్లు ఆదా చేస్తాయన్నారు. 2017లో జీఎస్టీ సంస్కరణ ప్రారంభించినప్పుడు పాత చరిత్రను అది మార్చిందని, ప్రస్తుత జీఎస్టీ సంస్కరణలు కొత్త చరిత్ర సృష్టించడానికి నాంది పలికిందని అన్నారు. ప్రతిరోజూ అవసరమైన వస్తువులు పన్ను రహితంగా లేదా 5శాతం లేదా 18శాతం జీఎస్టీ కింద ఉంటాయని చెప్పారు. 12శాతం పన్ను ఉన్న 99శాతం వస్తువులు 5శాతం పన్నులోకి వచ్చా యని, పేదలు వాడే అనేక వస్తువులపై సున్నా శాతం జీఎస్టీ ఉంటుందని చెప్పారు. ఆహార పదార్థాలు, ఔషధాలు, సబ్బులు, బ్రష్, పేస్ట్, హెల్త్ అండ్ ఇన్సూరెన్స్, ఇంకా పలు వస్తువులు, సేవలు జీరో టాక్స్ లేదా 5 శాతం పన్నుకే పరిమితమవుతాయని చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు డబుల్ బొనాంజాగా అభివర్ణించారు.

# నేటి నుంచే కొత్త జీఎస్టీ..

(మొదటి తరువాయి)

ప్యాకేజ్ ఆహారం.. అనగా బిస్కట్లు, స్నాక్స్, జ్యూస్‌లు
కండెన్స్‌డ్ పాలు,డెయిరీ ఉత్పత్తులు
హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్, టాల్కమ్ పౌడర్, ఫేస్ పౌడర్
కాఫీ, ఐస్‌క్రీమ్‌లు
సైకిళ్లు, స్టేషనరీ, స్కూల్ ఆఫీస్ సామాన్లు (పెన్సిళ్లు, నోట్‌బుక్స్)
దుస్తులు, పాదరక్షలు
ఔషధాలు, గ్లూకోమీటర్లు, డయాగ్నస్టిక్ సేవలు 18 శాతం పరిధిలోకి వచ్చేవి:
గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్: ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, డి ష్ వాషర్లు, పెద్ద తెర ఉన్న టెలివిజన్లు.
గృహ నిర్మాణం సిమెంట్, నిర్మాణ సామగ్రి
ఆటోమొబైల్స్: ద్విచక్ర వాహనాలు చిన్న కార్లు (1200 సీసీ కన్నా తక్కువ) ఇన్సూరెన్స్, ఫైనాన్స్
బీమా, ఆరోగ్య బీమా పాలసీలు
40% పన్ను పరిధిలోకి వచ్చేవి..
పొగాకు ఉత్పత్తులు, మద్యం, పాన్ మసాల
ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ వేదికలు.
లగ్జరీ వాహనాలు, ప్రీమియం లిక్కర్
3500 సీసీ కన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న లగ్జరీ ద్విచక్ర వాహనాలు
కోకా కోలా, పెప్సీ లాంటి సాఫ్ట్ డ్రింక్‌లు.
జీఎస్టీ సంస్కరణలతో వృద్ధి వేగవంతం: మోదీ

దేశంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే జీఎస్టీ సంస్కరణలు భారత వృద్ధిని వేగవంతం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నొక్కి చెప్పారు. ఇది ఆత్మ నిర్భర్ భారత్ కోసం ఒక పెద్ద, అతిముఖ్యమైన అడుగు అని, స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహాన్నిచ్చి దేశ శ్రేయస్సుకు అనుసంధానిస్తుందని ఉద్ఘాటించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన ఆయన సవరించిన జీఎస్టీ రేట్ల అమలును గుర్తు చేశారు. విదేశీ మూలాల వస్తువులు తెలియకుండానే ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయని, ఈ క్రమంలో స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

# సిద్దిపేట ఎవరి జాగీరు కాదు

(మొదటి తరువాయి)



అలాగే అక్కడ గ్రామ మహిళలతో కొద్దిసేపు బతకమ్మ ఆడారు. లక్ష్మీదేవిపల్లి స్టేజీ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వగ్రామం చింతమడకకు చేరుకున్నారు. ఈ క్రమంలో డప్పుచప్పులతో ఆమెకు మహిళలు స్వాగతం పలకగా.. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఇంట్లో బతుకమ్మను పేర్చి రామాలయం ముందు ఉన్న గ్రౌండ్‌లో బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 2005కు ముందు తాను ఎన్నోసార్లు గ్రామానికి వచ్చి వెళ్లే దాన్నని, ఆ తర్వాత ఉద్యమంలో బిజీగా మారి ఇక్కడికి రాలేకపోయానని అన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు సిద్దిపేటకు రావాలన్నా, చింతమడకకు రావాలన్న ఎన్నో ఆంక్షలు ఉన్నాయని తెలిపారు. ఇదే చింతమడక గడ్డలో పుట్టిన కేసీఆర్.. ఇక్కడి ప్రజల అండదండలతో, వారిచ్చిన ఆత్మస్థైర్యంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్రాన్ని సాధించి ప్రజలకు సుపరిపాలనను అందించారని అన్నారు. ఆయన చాటున కొందరు అక్రమాలకు పాల్పడి చంద్రుడు లాంటి తన తండ్రికి మచ్చ తీసుకువచ్చారని తెలిపారు. ఆ విషయాన్ని తాను బయటపెట్టినందుకు కుటుంబంలో గొడవలు పెట్టి తల్లిని పిల్లను ఎడబాపారని ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా వారి భరతం పడతానంటూ హెచ్చరించారు. తాను సిద్దిపేటకు, చింతమడకకు రాకుండా ఎన్నో ఆంక్షలు పెడుతున్నారని.. ఆంక్షలు పెడితే ఒక్కసారి కాదు వందసార్లు వచ్చి తన సత్తా చూపిస్తానని తెలిపారు. తనకు చింతమడక జన్మ భూమి అని, రానున్న రోజులు కర్మ భూమి కావచ్చున్నారు. దుఖంలో ఉన్న తనకు చింతమడక ప్రజలు ప్రేమను పంచారనీ, భవిష్యత్తులో అండగా నిలవాలని చెబుతూ కంటతడి పెట్టారు.

# చెరువును కెమికల్స్ తో నింపేసిన హెటిరో కెమికల్ కంపెనీ

(మొదటి తరువాయి)



పంటలు ఎండిపోతున్నాయి. చేపలన్నీ చనిపోయి నీటి మీద తేలుతున్నాయి. ఆరోగ్య సమస్యల మోత చెరువు నీరు కాలుష్యం కావడంతో గ్రామస్థులు శ్వాసకోస సమస్యలు, చర్మవ్యాధులు, గర్భిణీల్లో గర్భస్రావాలు, చిన్నారుల్లో విపరీతమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎయిర్‌ఫోర్స్ ల్యాండ్లోనూ వ్యర్థాలు గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, హెటీరో యాజమాన్యం వ్యర్థాలను పక్కనే ఉన్న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ ల్యాండ్లో పూడ్చిపెడుతోంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే ఈ భూముల్లో కూడా రసాయన మురుగు వదిలిపెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామస్థులు ఈ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. "ఎవరైనా సాధారణ రైతు మురుగు వదిలినా కేసులు పెడతారు. కానీ హెటీరో మీద మాత్రం ఎందుకు నిశ్శబ్దం?" అని మండిపడుతున్నారు.

**భూముల విలువ పతనం**

దోమడుగు, బంతపల్లి చెరువుల నీరు కాలుష్యం కావడంతో భూముల విలువ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. రైతులు అప్పులు తీర్చలేని స్థితికి చేరుకున్నారు. మత్స్యకారులు జీవనాధారం కోల్పోయారు.

**- హెటీరో కంపెనీ వెనుక రాజకీయ ప్రభావం..?**

హెటీరో కంపెనీ వ్యవస్థాపకుడు పార్థసారధి రెడ్డి దేశంలోని అత్యంత ధనవంతులలో ఒకరని, ఆయన రాజకీయ ప్రభావం కారణంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోలేకపోతున్నదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులందరూ అమ్ముడైపోయారు. అందుకే మాకు న్యాయం జరగడం లేదు అని వాపోతున్నారు.

**ప్రజల ఆవేదన**



**అంగడి సరిత, బంతపల్లి గ్రామస్థురాలు**

మేము బతికే అవకాశం లేకుండా పోతుంది. గర్భిణీ స్త్రీలు గర్భం దాల్చలేని స్థితి. చిన్నపిల్లల్లో జుట్టు రాలిపోతుంది. ఇది మనుషుల మీద జరగుతున్న నేరం



**రైతు , బోనత్ శ్రీరాములు**

మా పొలాలు ఎండిపోయాయి, మా చేపలు చనిపోయాయి. మేము ఎవరిని అడగాలి? ఎవరు మాకు న్యాయం చేస్తారు? "ఈ చెరువుపైనే మేము ఆధారపడ్డాం. ఇప్పుడు మా జీవితమే చీకటిలోకి నెట్టేశారు" ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకోవాలి.


**2025 సెప్టెంబర్ 22, సోమవారం తెలుగు పంచాంగం**




**మాసం - పక్షం**
అశ్వయుజ మాసం, శుక్ల పక్షం
**తిథిః**
ప్రథమి: Sep 22 ఉదయం 1:23 AM - Sep 23 మధ్యాహ్నం 2:56 AM
ద్వితీయ: తరువాత
**నక్షత్రం**
ఉత్తర ఫల్గుని: Sep 21 9:32 AM - Sep 22 11:24 AM
హస్త: Sep 22 11:24 AM - Sep 23 1:40 PM
**శుభ సమయాలు**
బ్రహ్మ ముహూర్తం: 4:32 - 5:20 AM
అభిజిత్ ముహూర్తం: 11:44 AM - 12:32 PM
**అశుభ సమయాలు**
రాహుకాలం: 7:38 - 9:08 AM
యమగండం: 10:38 - 12:08 PM
గులికా: 1:38 - 3:08 PM
దుర్ముహూర్తం:
12:32 - 1:20 PM, 2:56 - 3:44 PM
వర్జ్యం: 8:35 - 10:20 PM

# భూ కబ్జాదారుల ఆగడాలను అడ్డుకునేందుకు హైడ్రా చర్యలు


కూన శ్రీశైలం గౌడ్



**గాజులరామారం,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్, మితుల నగర్, నర్సింహ నగర్, గాలిపోచమ్మ బస్తిలో అక్రమ కట్టడాలపై హైడ్రా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అక్కడికి చేరుకొని భూ కబ్జాదారుల చేతుల్లో మోసపోయిన పేద ప్రజలతో మాట్లాడారు.నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాన్ని నిలువెత్తు కట్టడాలతో ఆక్రమణకు దారితీసిన బిఆర్ఎస్ నాయకుల తీరును ఆయన విమర్శించారు. గతంలో స్వచ్ఛమైన ప్రకృతి కనిపించేదని, ఇప్పుడు భూ బకాసురులు డబ్లికేట్ పట్టాలతో ఎకరాల స్థలాలు కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో హైడ్రా చర్యలు చేపట్టారని, బాధితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాసితులు, ప్రజలు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను సాధిద్దాం

బీజేపీ అధ్యక్షుడు వీటి యాదవ్



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడ టూ టౌన్ బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు పెద్ద బోయిన వీటి యాదవ్ మాట్లాడుతూ, నిజాం నవాబుకు తలవంచకుండా వీరోచితంగా పోరాడిన తెలంగాణ తొలి స్పీకర్ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్ని ధారపోసి, తెలంగాణ సాధననే లక్ష్యంగా పెట్టుకున్న మహానుభావుడని పేర్కొన్నారు.బాపూజీ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గుండ్లపల్లి శ్రీకాంత్, భాషాపాక శంకర్, నర్సింగ్, గోజు భరన్ కుమార్, చిలుకూరు శ్యామ్, కొంగరి వెంకటరమణ, నక్క శివ, పోరాడి శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, యాదగిరి, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ఎంబీబీఎస్ ఫ్రీ సీట్ సాధించిన తరుణికి ఘన సన్మానం



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా నిజయోజకవర్గ కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొత్ర బాల నాగయ్య కుమార్తె కొత్ర. తరుణి గవర్నమెంట్ ఎంబీబీఎస్ ఫ్రీ సీట్ సాధించడంతో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు. సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన విద్యార్థిని వైద్య విద్యలో ప్రవేశం పొందడం ఎంతో గర్వకారణమని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారుతరుణి లాంగ్ టార్మ్ కోచింగ్ తీసుకొని ఎంతో కష్టపడి ఈ ఫలితాన్ని సాధించిందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. "మా ఇంట్లో ఒకరు డాక్టర్ కావడం గొప్ప విషయం. ఇది మా కుటుంబానికి గర్వకారణం" అని వారు హర్షం వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని, మరిన్ని విద్యార్థులు లక్ష్య సాధన కోసం ముందుకు రావాలని పెద్దలు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా స్థానికులు, బంధువులు, విద్యాభిమానులు తరుణికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీరప్ప నగర్ అభివృద్ధికి నా సహకారం ఎప్పుడూ ఉంటుంది


ఎమ్మెల్యే వివేకానంద్



**జీడిమెట్ల, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జీడిమెట్ల డివిజన్ బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని, బీరప్ప నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు గత పదకొండేళ్లలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కుంట సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అరుణా రెడ్డి, సంతోష్, బాల్ రెడ్డి, మధు, వెంకటేష్, నరేందర్, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తాం

కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**ఆల్విన్ కాలనీ,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
124 ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే బతుకమ్మ దసరా ఉత్సవాలు ఈసారి కూడా అంబిర్ చెరువు కట్టపై ఘనంగా జరగనున్నాయి. ఈ మేరకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఉత్సవ ప్రాంగణాన్ని పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికలు రూపొందించారు. తెలంగాణ ఆడపడుచుల భక్తి శ్రద్ధలకు అనుగుణంగా బతుకమ్మ ఉత్సవాలు సౌకర్యవంతంగా సాగేందుకు మైదాన చదును, లైటింగ్, మంచినీటి సదుపాయం, పారిశుధ్య ఏర్పాట్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తొలగించేందుకు ఎంటమాలజీ సిబ్బందిని రంగంలోకి దింపినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, నరసింహులు, సిద్దయ్య, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, రాజిరెడ్డి, బ్రహ్మయ్య, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పల కుటుంబ సభ్యులను పరామర్శించిన వేముల వీరేశం

**నకిరేకల్ సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నార్కెట్‌పల్లి పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు మట్టిపల్లి యాదగిరి గారు గుండెపోటుతో మరణించగా వారి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.నార్కెట్‌పల్లి పట్టణానికి చెందిన చొల్లేటి శివ గారు అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన కాటం మహేష్ గారు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాగ వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు..

# ధూళికట్ట విద్యార్థుల క్రీడా ప్రతిభకు జిల్లా స్థాయి గుర్తింపు



**ఎలిగేడు, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు మండలం నీలగిరి ఎక్స్‌ప్రెస్ పరిధిలోని ధూళికట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలోనూ తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ నెల 19, 20 తేదీలలో సుల్తానాబాద్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్.జి.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ధూళికట్ట హై స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు.9వ తరగతి విద్యార్థి జల్లి నాగచైతన్య (ముప్పిరి తోట) అండర్-14 విభాగంలో వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా, 8వ తరగతి విద్యార్థి ఎస్. సిద్ధార్థ అండర్-14 కబడ్డీ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థుల ప్రతిభకు ప్రేరణగా నిలిచిన ఫిజికల్ డైరెక్టర్ వి. శ్రీకాంత్‌ను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిజిలి సదయ్య, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు హర్షాతిరేకాలతో అభినందించారు.

# ఎలిగేడులో ఘనంగా బొడ్డెమ్మ నోము, ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు




**ఎలిగేడు, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడులో ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో బొడ్డెమ్మ నోము వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించుకున్నారు. అమావాస్యకు తొమ్మిది రోజుల ముందు మట్టితో తయారు చేసిన బొడ్డెమ్మను రంగురంగుల పూలతో అలంకరించి, ప్రతిరోజూ బతుకమ్మ పాటలతో సంబరాలు జరుపుకుంటారు. అమావాస్య చివరి రోజు బొడ్డెమ్మను నోముకొని ఎత్తుకుని, పసుపుతో తయారైన గౌరమ్మను పూజించి, ఆ పసుపును గంధంగా పూసుకొని ప్రసాదాలను వాయినంగా పంపిణీ చేస్తారు. పిల్లాపాపల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు కోసం అమ్మవారిని ప్రార్థిస్తూ బొడ్డెమ్మను నిమజ్జనం చేయడం జరిగింది.అదే రోజు సాయంత్రం రంగురంగుల పువ్వులతో బతుకమ్మను అలంకరించి, ఆటపాటలతో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ప్రారంభించినట్లు మహిళలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ రోజు నుండి తొమ్మిది రోజులపాటు ప్రతిరోజూ పువ్వులను సేకరించి, బతుకమ్మను పేరుస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ వేడుకలు తెలంగాణ సాంస్కృతిక సంపదను ప్రతిబింబించేలా కొనసాగుతాయని వారు పేర్కొన్నారు.

# బతుకమ్మ పేర్చిన హైకోర్టు న్యాయవాది



**ఎలిగేడు, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఆడబిడ్డలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ ఉత్సవాలు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ఈ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా హైకోర్టు న్యాయవాది, ఎలిగేడు మాజీ వైస్ ఎంపీపీ, ఆదివారం తన చేతుల మీదుగా బతుకమ్మను పేర్చారు. సంప్రదాయబద్ధంగా మట్టితో తయారైన బతుకమ్మను రంగురంగుల పువ్వులతో అలంకరించి, భక్తి శ్రద్ధలతో పేర్చడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బతుకు నిచ్చే బతుకమ్మను పేర్చడం నాకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. తెలంగాణ ఆడపడుచులందరూ ఈ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటూ, సంప్రదాయాలను నిలబెట్టాలి" అని ఆకాంక్షించారు.

# శోభాయమానంగా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



**ఎలిగేడు, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు శోభాయమానంగా ముస్తాబవుతున్నాయి. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీలు మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరిస్తున్నారు.నేడు మండపాల్లో దుర్గామాత కొలువై భక్తులకు దర్శనమిస్తూ ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. మాలలు వేసుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి. కుంకుమ పూజ, అన్నదానం వంటి కార్యక్రమాల నిర్వహణకు ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని శక్తి స్వరూపిణిగా పూజిస్తూ భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలను జరుపుకుంటున్నారు.ఈ ఏడాది తిది వృద్ధి కారణంగా శరన్నవరాత్రి ఉత్సవాలు పదిహేడు రోజులుగా కాకుండా పదకొండు రోజులపాటు నిర్వహించబడుతున్నాయి. అక్టోబర్ 2న విజయదశమి రోజున అమ్మవారు కాత్యాయనీదేవిగా శోభాయాత్రలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు, మండపాలు, గ్రామాలు పూలతో, దీపాలతో, సంగీతంతో నిండిపోతూ ఆధ్యాత్మికతకు, సాంస్కృతిక వైభవానికి వేదికలుగా మారనున్నాయి.

# అమావాస్య రోజు అన్నదానం ఎంతో శ్రేష్టమైనది

నీలా మధుసూదన్ గుప్తా






**ఎల్బీనగర్,సెప్టెంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : మానవులుగా మనకు ఎవరు ఏమిఇచ్చినా సరే మళ్లీ కావాలంటాం ... కాని కడుపునిండా అన్నం పెడితే మాత్రం ఏమి కావాలని అడగరని నిరూపిస్తున్నారు. హస్తినాపురం ఆర్య వైశ్య సంఘ వారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మధుసూదన్ గుప్తా ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున ప్రజలకు కడుపు నిండా అన్నం పెడుతున్నారు . ఈ సందర్భంగా అధ్యక్షులు మధుసూదన్ గుప్త మాట్లాడుతూ హిందూ సంప్రదాయ ప్రకారం ధార్మికంలో అమావాస్య రోజున అన్నదానం చేస్తే ఎంతో పుణ్యపలమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎఫ్.సీ.ఐ. కాలనీలో నూతన పార్క్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఎల్బీనగర్,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సీ.ఐ. కాలనీలో నిర్మించిన నూతన పార్క్‌ను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అభివృద్ధి పనులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, లగ్గోని శ్రీధర్ గౌడ్, దూసరి మధు గౌడ్, పీ.వి.రావు, ఆనంద్ రాజ్, గడల రాజు, ఇలియాస్, కాలనీ అధ్యక్షులు నరసింహ రావు, జనరల్ సెక్రటరీ శేకేర్ రెడ్డి, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్య అన్నప్రసాదంతో ఆకలిని తీర్చిన సేవాభూషణ్ అవార్డు గ్రహిత



**మహబూబ్ నగర్,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలమూరు రైల్వే స్టేషన్ చౌరస్తాలో ఆదివారం అమావాస్య సందర్భంగా సేవాభూషణ్ అవార్డు గ్రహిత డా. నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ ఆకలితో ఉన్నవారికి తన తల్లి వరలక్ష్మి గారు స్వయంగా వండిన అన్నప్రసాదాన్ని అందించారు. పేద, ధనిక తేడాలేకుండా ప్రతి మనిషికి జానెడు పొట్టకు కాసింత ఆహారం అవసరమని, ఆకలితో ఉన్నవారికి డబ్బు కాకుండా ఆహారాన్ని ఇవ్వడం గొప్ప సేవ అని ఆయన పేర్కొన్నారు.కరోనా సమయంలో 13 రకాల నిత్యావసర వస్తువులు, ఆహారం, నీరు, పండ్లు, బట్టలు, దుప్పట్లు, మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు దాదాపు 1200 తెలుగు, హిందీ, ఇంగ్లీష్ టేబుల్స్ పటాలను ఉచితంగా అందించినట్లు వివరించారు. “మనకు ఉన్న దానిలో లేనివారికి కాసింత ఇవ్వడం నేర్చుకోవాలి” అని రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు.

# నిఖిల్ భరత్ స్కూల్ లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**కోరుట్ల సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మెట్ పల్లి పట్టణంలోని నిఖిల్ భర త్ స్కూల్ లో ఆదివారం ఘనంగా బతుకమ్మ వేడుకలు జరిగినవి ఈ కార్యక్రమం లో బతుకమ్మ ఉరంగు రంగుల పూలతో తయారు చేసి బ తుకమ్మ ఆట- పాటలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమం లో నిఖిల్ భరత్ స్కూల్ ప్రిన్సిపాల్ మ హర్షి, మరి యు ఉపాధ్యాయులు విద్యార్థిని విధ్యార్థులు పాల్గొన్నారు

# చదరంగం పోటీలో కేశెట్టి వీర్వచన్‌కు ద్వితీయ బహుమతి




**ఎలిగేడు, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాదులోని వీఆర్ఎస్ మరియు విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-6 చదరంగం పోటీలో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కేశెట్టి వీర్వచన్ ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు నగదు బహుమతితో పాటు మెమొంటో అందజేశారు.

# చదరంగం ఆటతో మేధాశక్తి వికాసం




**కరీంనగర్,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మేధాశక్తిని పెంచే చదరంగం ఆటను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రామ్‌నగర్‌లోని జగన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఓపెన్ అండర్-15 చదరంగం పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ చెస్ అకాడమీ ఆర్గనైజర్స్ అమిరిశెట్టి రాజేందర్, కేశెట్టి జగన్ మాట్లాడుతూ చదరంగం ఆట ఏకాగ్రతను పెంచి, మేధాశక్తిని వికసింపజేస్తుందని అభిప్రాయపడ్డారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమొంటోలు, మెడల్స్ అందజేశారు. ఓపెన్ విభాగంలో చిట్టుమల్ల కశ్యప్ ప్రథమ బహుమతిని, బండారి శివ ద్వితీయ బహుమతిని, అక్కినపల్లి విశృత్ రామ్ తృతీయ బహుమతిని సాధించారు. వివిధ కేటగిరీల్లో విజేతల ప్రతిభకు నిర్వాహకులు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా చెస్ డెవలప్మెంట్ డెమోక్రటిక్ కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు, బండారి శ్యామ్, చిట్టుమల్ల మారుతి తదితరులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు.

# పితృ అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**కరీంనగర్, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ గాంధీరోడ్ ఎస్ఆర్ఆర్ కాంప్లెక్స్ చౌరస్తా వద్ద పితృ అమావాస్య సందర్భంగా అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భక్తిపూర్వకంగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. దినసరి కూలీలు, చిరు వ్యాపారులు సహా సుమారు 500 మందికి సమితి సభ్యులు, దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.ప్రతి అమావాస్య రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కైలాస కిషోర్, గుండ రవి, వేణు, జి. శివ, జిల్లా జగదీష్, థాటి పల్లి సుబాష్, వెంకటేశం, ముప్ప సామ, మహేష్, పి. విజయ్ తదితరులు చురుకుగా పాల్గొన్నారు.వాసవి క్లబ్ కాపుల్స్ అధ్యక్షుడు జిల్లా జగదీష్, గణేష్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం సభ్యులు, ప్రముఖ వ్యాపారులు, అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు సహా సుమారు 60 మంది దాతలు ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. జై శ్రీరామ్, జై హనుమాన్, జై వాసవి నినాదాలతో కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది.

# నాంపల్లి శ్రీనివాస్‌కు బండి సంజయ్ జన్మదిన శుభాకాంక్షలు



**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్, 12వ డివిజన్ ఇంచార్జ్ నాంపల్లి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధిలో ఆయన సేవలను కొనియాడుతూ, ఆయన్ను మరింత శక్తివంతంగా ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

# నేరేడ్మెట్‌లో వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ





**నేరేడ్మెట్,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేరేడ్మెట్ రేణుకానగర్ బస్టాప్ వద్ద శ్రీ వాసవీ ఆర్యవైశ్య అభ్యుదయ సంగం ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ద్రవ్యాన్ని యేలిటి పుష్పలత గారు అందించగా, సంఘ సభ్యులు స్వయంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదం వడ్డించారు.దాదాపు 500 మంది పాల్గొని ఆహారాన్ని స్వీకరించారు. సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు పొందింది.

# గుంతల మయమైన రహదారి

అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆవేదన





**తెలకపల్లి,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న మట్టి రహదారి భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. వర్షాల కారణంగా రహదారి పూర్తిగా దెబ్బతిని, రైతులు, ద్విచక్ర వాహనదారులు రోజూ ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో వీధి దీపాల లేమితో పంట పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. “ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మాత్రం మారడం లేదు” అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మరమ్మత్తులు చేపట్టి, రైతుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సిపిఐ జాతీయ మహాసభలను విజయవంతం చేద్దాం

కోళ్ల ఏసయ్య



**పెద్దకొత్తపల్లి,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకోలు గ్రామంలో ఆదివారం సిపిఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోళ్ల ఏసయ్య మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఏర్పడిన సిపిఐ పార్టీ 100 ఏళ్లు పూర్తి చేసుకున్నదని, చండీగఢ్‌లో సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఐ శాఖ అధ్యక్షుడు సంగం కృష్ణ, మండల సహాయ కార్యదర్శి ఎం. లక్ష్మీనారాయణ, కడింటి స్వామి, కుమ్మరి వెంకటస్వామి, కడింటి శివకుమార్, బంట్రోత్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ



**మహాముత్తారం సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రకృతిని ఆరాధిస్తూ పూవులను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దమైన బతుకమ్మను ఆడబిడ్డలంతా మొదటిరోజు ఎంగిలిపూలతో పేర్చి అంగరంగ వైభవంగా ప్రారంభించారు. బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. బతుకమ్మలో ప్రధానమైన పుష్పం తంగేడుపూవు. తంగేడి పూవును మన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పుష్పంగా ప్రకటించటం జరిగింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో, తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం కలదు. సంవత్సరానికి ఒక రోజు వచ్చే బతుకమ్మ పండుగలో తీరొక్క పువ్వులు సేకరించి పేర్చి ఆడబిడ్డలంతా ఆనందంగా జరుపుకునే పండుగ బతుకమ్మ ప్రపంచానికే ఆదర్శం.

# శాతవాహనలో మంజులకి డాక్టరేట్

## రసాయన శాస్త్రంలో వినూత్న పరిశోధనకు గుర్తింపు




**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధకురాలిగా సేవలందించిన తిరుకోవెల మంజులకు డాక్టరేట్ డిగ్రీ మంజూరైంది. “సింథసిస్ ఆఫ్ పైరాన్ అండ్ పైపిరిడిన్ డెరివేటివ్స్ యూసింగ్ నావెల్ మెథడాలజీస్” అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ పట్టా ప్రకటించింది. ఈ పరిశోధనను సహ ఆచార్యులు డా. ఏ. జయంతి పర్యవేక్షణలో మంజుల విజయవంతంగా పూర్తి చేశారు. పరిశోధన కాలంలో ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఈ సందర్భంగా మంజుల విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య రవి కుమార్ జాస్తీ, పరీక్షల నియంత్రణ అధికారి డా. డి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ డా. ఎస్. రమాకాంత్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డా. వి. నమ్రత, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డా. ఎం. సరసిజ తదితరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, అదిలాబాద్‌లో రసాయన శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న మంజుల మాట్లాడుతూ “నా పర్యవేక్షకులు, కుటుంబ సభ్యుల సహకారం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు” అని అన్నారు. వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, బోధన-బోధనేతర సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# బాల్య మిత్రుల మానవత్వం

## మృతుడి కుటుంబానికి ఆర్థిక అండ



**అచ్చంపేట, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలోని మారుతి నగర్ కాలనీకి చెందిన బొమ్మక్కంటి శివ స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మంచాన పడి, చికిత్స పొందుతూ కొద్ది రోజుల క్రితం కన్నుమూశాడు. ఈ విషాద వార్త తెలుసుకున్న పదవ తరగతి బాల్య మిత్రులు మానవత్వాన్ని చాటుతూ ముందుకొచ్చారు. శివ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు అందరూ కలిసి సహాయహస్తం అందించారు. వారి బాబుకు భవిష్యత్తులో ఉపయోగపడేలా రూ.70,000 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. స్నేహానికి మారుపేరు గా నిలిచిన ఈ మిత్రుల సహాయాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో శివ కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం 49వఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**దేవరకొండ,సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నియోజకవర్గం ఇంచార్జి ఎర్ర ఆంజనేయులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి నల్గొండ జిల్లా కార్యదర్శి సలికినేని జీవ , డిండి మండల అధ్యక్షులు పేరుమల్ల అనిల్ కుమార్ చందంపేట మండల అధ్యక్షులు నాగిళ్ల వెంకటయ్య పాల్గొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జేబీ రాజు ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా అధ్యక్షులు కొండేటి వెంకట్ పిలుపు మేరకు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాము సెప్టెంబర్21 నుండి సెప్టెంబర్ 30 వరకు ప్రతి గ్రామంలో రాజ్యాంగంపై అవగాహన ప్రజలకు వివరిస్తూ చైతన్యం పరుస్తామని వారు తెలియపరిచారు . ఈ కార్యక్రమంలో నల్ల శేఖర్ బర్పటి పర్వతాలు ఇనాం తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా కేంద్రాలపై ఆకస్మిక దాడులు



**కోటపల్లి, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కోటపల్లి మండలంలోని ఆల్ గామ, సిర్సా గ్రామాల్లో ఆదివారం చెన్నూరు ఆబ్కారి శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. సుమారు 1900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 23 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు తయారీదారులపై కేసులు నమోదు చేశారు. బైండోవర్ ఉల్లంఘించిన వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై హరి హెచ్చరించారు.

# ఘనంగా భగవద్గీత పఠన పోటీలు



**కరీంనగర్, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణమండపంలో జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. మిషన్ ఇంచార్జ్ బ్రహ్మచారి అక్షయ చైతన్య మాట్లాడుతూ, “2000 మంది విద్యార్థులకు భగవద్గీత పాఠాలు నేర్పించి, పాఠశాల స్థాయిలో విజేతలైన వారికి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించాం. భగవద్గీత ద్వారా సత్ప్రవర్తన, జ్ఞాపకశక్తి, దేశభక్తి పెంపొందుతుంది,” అని తెలిపారు. ముఖ్య అతిథి చిట్టుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, “భగవద్గీత ప్రతి ఒక్కరూ పఠించాల్సిన గ్రంథం. ఇది ఆధ్యాత్మికతను పెంపొందించి జీవిత సమస్యలకు పరిష్కారం చూపుతుంది,” అని పేర్కొన్నారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు.

# మెడికవర్ ఆసుపత్రిలో వైద్యం వికటించి వ్యక్తి మృతి



**కరీంనగర్, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ అనంతరం రోగి మృతి చెందిన ఘటన కలకలం రేపుతోంది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలానికి చెందిన రోడ్డ అనిల్ అనారోగ్యంతో ఈ నెల 6న ఆసుపత్రిలో చేరగా, వైద్యులు గుండె వాల్వుల బ్లాక్ అయ్యాయని చెప్పి ఆరోగ్య శ్రీ పథకంలో శస్త్రచికిత్స చేశారు. ఆపరేషన్ అనంతరం 80 వేల రూపాయలు అదనంగా వసూలు చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. నాలుగు రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసిన అనిల్, నిన్న సాయంత్రం ఇంట్లోనే కుప్పకూలి మృతి చెందాడు. ఆసుపత్రి నిర్లక్ష్యం వల్లే మృతి జరిగిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఆసుపత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనపై స్పందించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితులకు మద్దతుగా బీఎస్పీ, ఏఐవైఎఫ్, దళిత సంఘాలు, యువజన సంఘాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి.

## శ్రీ దుర్గాభవానీ అమ్మవారికి

# విశేష పూజా కార్యక్రమాలు



**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నవరాత్రోత్సవాల సందర్భంగా నగునూర్‌లోని పరివార సమేత శ్రీ దుర్గాభవానీ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ద్రవ్య, ఫలపంచామృత అభిషేకం, ధ్వజారోహణ, విశేష హారతులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, కమిటీ సభ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, పల్లేర్ల శ్రీనివాస్, తొడుపునూరి వేణుగోపాల్, రాచమల్ల ప్రసాద్, శ్రీనివాస్, రమేష్, పడకంటి ప్రసాద్ పాల్గొన్నారు. అమ్మవారి దీక్ష భక్తులు, సుహాసినీలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.

# మత సౌభ్రాతృతానికి ప్రతిరూపంగా మూడు విశేష కార్యక్రమాలు




**కరీంనగర్,సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మత సౌభ్రాతృతానికి ప్రతిరూపంగా కరీంనగర్ పట్టణంలో మూడు విశేష కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మహాత్మ జ్యోతిబా పూలే మైదానంలో జమాతే ఇస్లామీ ఆధ్వర్యంలో మమ్మద్ ప్రవక్త 1500వ జన్మదినాన్ని పురస్కరించుకొని జన్మవృత్తాంత ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తిలకించారు. ఆయన వెంట జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షుడు సోహెద్ ఖాన్, మాజీ అధ్యక్షుడు కైరుద్దీన్, మాజీ కార్పొరేటర్ వాల రమణారావు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇక దసరా ఉత్సవాల్లో భాగంగా చింతకుంటలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద మొట్టమొదటిసారి రామ్ లీలా ఉత్సవాలను వచ్చే నెల 2న నిర్వహించనున్నట్లు మంజునాథ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏనుగు రవీందర్ రెడ్డి, భూక్య తిరుపతి నాయక్, బోనాల శ్రీకాంత్, రేణిగుంట రాజు, బెజ్జంకి సంపత్, మణికంఠ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదే రోజు సత్సంగ్ గోవింద్ నగర్ మరియు సింద్ సమాజ్ సభ్యులు ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను వారి క్యాంపు కార్యాలయంలో కలిసి 350వ షాహిద్ శతాబ్ది నగర కీర్తన యాత్ర 2025కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో సింద్ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం




**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థాపనకు వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లో విజయదశమి ఉత్సవం ఘనంగా జరిగింది. అయోధ్యపురి మండలం గణేష్ నగర్ బస్తీలోని అతిథి బాంకెట్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యులు బూర్ల దక్షిణామూర్తి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, “డాక్టర్ హెగ్డేవార్ 1925లో నాగపూర్ కేంద్రంగా 16 మంది బాలలతో ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా విస్తరించి, అన్ని జిల్లాల్లో శాఖలు ఏర్పడ్డాయి. మాధవరావు సదాశివ గోల్వాల్కర్ నాయకత్వంలో సంఘం మరింత బలపడింది,” అని తెలిపారు. వంద సంవత్సరాల ప్రయాణంలో ‘పంచ పరివర్తన్’ అనే లక్ష్యంతో సామాజిక సమరసత, ప్రకృతి పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, పౌర విధులు, స్వదేశీ భావనలపై కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రతి పౌరుడు దేశ బాధ్యతలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఉత్సవంలో జిల్లా సంఘచాలక్ సీఏ నిరంజనా చారి, ఘనవేషధారి 56 స్వయంసేవకులు, మాతలు, బాలలు సహా మొత్తం 145 మంది పాల్గొన్నారు. అనంతరం “షమ్మీ బంగారం” ప్రసాదంగా అందించారు.

# సిపిఐ జాతీయ మహాసభల సూచికగా జెండా ఆవిష్కరణ



**తెలకపల్లి, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలకపల్లి మండల కేంద్రంతో పాటు గౌరెడ్డిపల్లి, కామారెడ్డిపల్లి, ఆలేరు, పెద్దపల్లి, గట్టు, రాయిపాకుల గ్రామాల్లో ఆదివారం సిపిఐ జాతీయ మహాసభల ప్రారంభ సూచికగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దేశామోని ఆంజనేయులు అధ్యక్షత వహించగా, సిపిఐ మండల కార్యదర్శి వేనెపల్లి రవీందర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్ పాల్గొన్నారు. మతోన్మాద రాజకీయాలు, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని, నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు పోరాడుతారని రవీందర్ అన్నారు. చండీగర్‌లో జరుగుతున్న జాతీయ మహాసభలు భవిష్యత్ భారతానికి దిక్సూచి అవుతాయని తెలిపారు. బిచ్చయ్య, సీత్తయ్య, పార్వతలు, గొడుగు విష్ణు, బుగ్గ స్వామి, నరేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బంగారయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్ నిర్మాతలు..

-విద్యార్థులు విద్యతో పాటు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి
-ఉస్మానియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఏ.క్రిష్ణయ్య
-ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం యూనిట్ - 4 సేవలు అభినందనీయం
-తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి
-తట్టి అన్నారంలో ముగిసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ -4 ప్రత్యేక శిబిరం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
విద్యార్థులు దేశ భవిష్యత్ నిర్మాతలని ఉస్మానియా విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ డీన్, సీనియర్ ప్రొఫెసర్ ఏ.క్రిష్ణయ్య అన్నారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ తట్టి అన్నారం గ్రామంలో బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ - 4 వాలంటర్లు 7 రోజుల ప్రత్యేక శిబిరం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ డీన్, సీనియర్ ప్రొఫెసర్ ఏ.క్రిష్ణయ్య హాజరై మాట్లాడారు... విద్యార్థులు విద్యతో పాటు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్ నిర్మాతలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు దేశానికి సేవలందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత సమాజంలో విద్యతో దేనినైనా సాధించవచ్చునని, ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అన్ని



రంగాల్లో రాణించాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, మహిళా విద్యా, జలసంరక్షణ అంటూ రోగాలు నివారించే కార్యక్రమాలను నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి, డాక్టర్.వెంకటేశ్వర్లు, తదితరులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూత్ మోటివేటర్ డాక్టర్ రవితేజ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపుకు హాజరైన విద్యార్థులకు జాతీయ స్థాయిలో సాహసయాత్ర, జాతీయ సమైక్యత శిబిరాలకు జాతీయ స్థాయిలో యువజనోత్సవాలకు ప్రోత్సహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కుమార్ సారధ్యంతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యాసాగర్ నేతృత్వంలో 3600 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలలో శిక్షణా పొంది జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. సీనియర్ ఎన్ఎస్-ఎస్ వాలంటీర్ యూనిట్ రోహిణి, మీన, అర్చన, గాయత్రి వారి అనుభవాలను తెలియజేస్తూ గ్రామ ప్రజలకు, నాయకుల ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్యాంపు ద్వారా గ్రామంలో డ్రగ్స్ వాడకం హానికరమని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం తమ అదృష్టంగా భావించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -4 వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో రాంలీలా బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభం



**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత పదిహేను సంవత్సరాలుగా కరీంనగర్ మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాంలీలా కార్యక్రమాన్ని ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శనివారం ఉదయం వాకర్స్‌తో కలిసి గ్రౌండ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాంలీలా అనేది కరీంనగర్ ప్రజల సంస్కృతిక ఉత్సవం. గత అనుభవాలను పరిగణలోకి తీసుకొని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి, ఈసారి మరింత వైభవంగా నిర్వహిస్తాం" అని తెలిపారు. స్థానిక మాజీ కార్పొరేటర్లు మల్లికార్జున, రాజేందర్, బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేష్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ రావు, గంధం శ్రీనివాస్ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులు ఆయనతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.అంతకుముందు చైర్మన్ నరేందర్ రెడ్డి మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ప్రజలతో కలిసి నడుస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతను వివరించారు. "రోజువారీ నడక శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతతను అందిస్తుంది" అని అన్నారు. వాకర్స్ తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శాల్వా తో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీ.ఎన్.జీ.ఓ.ల జిల్లా నాయకులకు వినతిపత్రం అందజేసిన సీనియర్ లైసెన్స్ సర్వేయర్లు




**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గత 15 నుండి 20 సంవత్సరాలుగా వివిధ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ లైసెన్స్ సర్వేయర్లు, భూభారతి చట్టంలో తమ సేవలకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ జిల్లా టీ.ఎన్.జీ.ఓ.ల అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంలో భూముల సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో, అనుభవజ్ఞులైన 52 మంది సీనియర్ లైసెన్స్ సర్వేయర్ల సేవలను ప్రాధాన్యతతో వినియోగించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ గారి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే చర్యలు తీసుకుంటాను" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీ.ఎన్.జీ.ఓ.ల రాష్ట్ర కార్యదర్శి సర్దార్ హర్మిందర్ సింగ్, జిల్లా సర్వే & ల్యాండ్ రికార్డ్స్ యూనియన్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్, కార్యదర్శి పి. జీవన్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా లైసెన్స్ సర్వేయర్ యూనియన్ అధ్యక్షుడు పి. జగన్ మోహన్, కార్యదర్శి కె. విజేందర్ రెడ్డి, సర్వేయర్లు ఎ. వెంకటేశం, చి. లక్ష్మణ్, ఆర్. కరుణాకర్, ఆర్. కృష్ణ, కె. సురేష్, కె. రాజు, ఎస్. గోపాల్, జె. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ త్యాగఫలమే ఎస్టీ రిజర్వేషన్లు

## ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.

**దేవరకొండ,సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎస్టీ రిజర్వేషన్లు అమలు చెసి నేటికి యాభై వసంతాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఆదివారం హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డు వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి బంజార సంఘం జాతీయ నాయకులు రవీంద్ర నాయక్ ,రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్ ,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్,రైతు కమిషన్ చైర్మన్ కొందండ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే బాలు నాయక్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు . ఎమ్మెల్యే మాట్లాడుతూ, అడవులలో నివసించే గిరిజనుల దయనీయ స్థితిని అర్థం చేసుకొని, గిరిజన సమాజానికి వెలుగులు నింపాలనే సంకల్పంతోనే భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. ఈ రిజర్వేషన్ల వల్ల గిరిజనులు



సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో విశేషమైన మార్పులు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా కొన్ని విచ్ఛిన్న శక్తులు గిరిజన సమాజాన్ని విభజించి తమ రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. గిరిజనులు ఇలాంటి శక్తుల మాటలు నమ్మకుండా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. గిరిజనుల శక్తి ఐక్యతలోనే ఉందని ఆయన గుర్తు చేశారు.
అంతేకాకుండా గిరిజన సమాజానికి విద్య, ఉపాధి, రాజకీయాల్లో మరింత అవకాశాలు కల్పించేందుకు గిరిజనులంతా సంఘటితంగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సంఘం జాతీయ అధ్యక్షులు ధరావత్ రవీందర్ నాయక్, మహబూబాద్ పార్లమెంట్ సభ్యులు బాల్ రాం నాయక్, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్, రైతు కమిషన్ చైర్మన్ కొందండ రెడ్డి,శాసన మండలి సభ్యులు అద్దంకి దయాకర్, బంజారా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూరులో కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉప్పునుంతల మండలంలోని వెల్టూర్ గ్రామంలో 35వ సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. ఈ శిబిరానికి జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి సీతారాం, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యాదయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఏడురోజులుగా శిక్షణ పొందుతున్న క్రీడాకారుల్లో పలువురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. శిక్షణలో భాగంగా క్రమశిక్షణ, లక్ష్యసాధనపై సూచనలు, సలహాలు అందించారు. మారుమూల గ్రామంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడాన్ని అభినందించిన అధికారులు, గ్రామ పెద్దలు, యువకుల సహకారాన్ని ప్రశంసించారు. ఈసారి 33 జిల్లాల పోటీల్లో నాగర్ కర్నూల్ జిల్లా ప్రథమ స్థానం సాధించాలని ఆకాంక్షించారు. వెల్టూర్ క్రీడా ప్రాంగణ అభివృద్ధికి ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ సహకారంతో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండెమోని లింగమయ్య యాదవ్, బూసిరాజ్, మల్లయ్య, జిల్లా టెక్నికల్ బోర్డు సభ్యుడు శ్రీనివాసులు, కబడ్డీ అసోసియేషన్ మెంబర్ మోహన్ గౌడ్, గుద్దటి బాలరాజు, ఉప్పరి బాలరాజు, సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో మహాలయ అమావాస్య సందర్భంగా అన్నదానం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద ఆదివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో 27వ మాస అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు వోల్లాల సుమలత ప్రసాద్ (సప్తవర్ణం ఫ్లెక్సీ) ఆధ్వర్యంలో అవ్వ సులోచన-ఆనందం, అవ్వ గాయత్రి -సందీప్ దంపతుల కోరిక మేరకు మధ్యాహ్నం 12:30కి అన్నదానం నిర్వహించారు.గత 26 నెలలుగా దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని నిర్వాహకుడు కాసనగొట్టు వినయ్ తెలిపారు. సేవా భావంతో ముందుకు సాగుతున్న ఈ కార్యక్రమంలో గాయత్రి సేవా సమితి సభ్యులు రావికంటి రాజు, చిట్టిమల్ల రవి, పైడా నరేందర్, కటకం సత్యనారాయణ, నాగమల్ల శ్రీనివాస్, బొల్లం శ్రీనివాస్, సంకీస ఆంజనేయులు, కముటల గురుచరణం, బొల్లం ఆంజనేయులు, బొల్లం లక్ష్మీనారాయణలు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఎంగిలి పూల బతుకమ్మతో కరీంనగర్ వీధుల్లో ఉత్సాహం



**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బతుకమ్మ పండుగ తొలిరోజు కరీంనగర్ నగరంలో ఎంగిలి పూల బతుకమ్మను ఆడపడుచులు అంగరంగ వైభవంగా జరిపారు. ప్రతి వీధిలో కోలాటాలతో, బతుకమ్మ పాటలతో, కొత్త చీరలలో మెరిసిపోతూ, ఆనందంతో నృత్యాలు చేస్తూ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయాన్ని సజీవంగా నిలిపేలా నగరమంతా ఉత్సవ వాతావరణంలో మునిగిపోయింది.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి పద్మశాలి సంఘం తరఫున ఘన నివాళులు



**వరంగల్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా వరంగల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కోత్తవాడలోని బాపూజీ జంక్షన్ వద్ద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మహానగర మేయర్ గుండు సుధారాణి, 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ యెలుగం లీలావతి సత్యనారాయణ పాల్గొన్నారు. బాపూజీ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను యువతకు చేరవేయాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంథని నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోట రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం శాలపల్లె క్రాస్‌రోడ్డు వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు, ప్రజలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాపూజీ 1952లో ఆసిఫాబాద్ నుండి శాసనసభకు ఎన్నికై 1971 వరకు ప్రజాప్రతినిధిగా సేవలందించారని, 1969లో తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన నిస్వార్థ రాజకీయవాది అని కొనియాడారు. చేనేత రంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. బాపూజీ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.


# 35వ సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలు ప్రారంభం



**దేవరకొండ, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 35వ అంతర్ జిల్లా సబ్‌జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నల్గొండ జిల్లాలోని 33 మండలాల బాల-బాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచన మేరకు ముఖ్య అతిథిగా హాజరైన చందంపేట మాజీ ఎంపీపీ ఏడుపుల గోవింద్ యాదవ్, కబడ్డీ క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేశారు. "దేవరకొండ నియోజకవర్గం క్రీడల్లో ముందంజలో ఉండాలి. క్రీడాకారుల అభివృద్ధికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ముచర్ల ఏడుకొండలు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్, మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి, రాంసింగ్ నాయక్, హనుమ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి.

# అవసరానికి అనుగుణంగా యూరియా వాడకమే పంటలకు ఆరోగ్యం

**వ్యవసాయ అధికారి ఉమాపతి**



**ఎలిగేడు, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు మండలం నీలగిరి ఎక్స్‌ప్రెస్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఉమాపతి మాట్లాడుతూ, రైతులు తమ పంటల అవసరాన్ని బట్టి యూరియా వాడకాన్ని నియంత్రించుకోవాలని సూచించారు. అధికంగా వాడితే మట్టికి నష్టం కలుగుతుందని, అవసరానికి తగ్గట్టుగా వాడితే పంటల ఆరోగ్యం మెరుగవుతుందని వివరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున మొత్తం 450 బస్తాల యూరియాతో పాటు 180 నానో యూరియా ప్లస్ బాటిల్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ముప్పిరి తోట గ్రామంలో 340 బస్తాలు, లోకపేట గ్రామంలో 100 బస్తాల యూరియాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అందజేశామని చెప్పారు. నానో యూరియా ప్లస్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో విక్రం, ఏఈవోలు గణేష్, సురేష్, శరణ్య, సొసైటీ సిబ్బంది పాల్గొని సహకారం అందించారు.

# దసరా సెలవుల్లో అప్రమత్తంగా ఉండండి

**ఎస్పీ మహేష్ గితే సూచనలు**



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దసరా పండుగ సందర్భంగా ప్రజలు ఊరెళ్లే సమయంలో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఇంటికి తాళం వేసే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచాలని, సోషల్ మీడియాలో ట్రావెల్ వివరాలు పోస్ట్ చేయవద్దని హెచ్చరించారు. సీసీ కెమెరాలు, లైట్లు, కర్టెన్లు, పొరుగువారి సహకారం వంటి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# జీఎస్టీపై పనికిమాలిన విమర్శలు సరికాదు

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు జరిగిన నష్టమేమిటో స్పష్టంగా చెప్పకుండా, ఇడ్లీ, దోశ, వడ వంటి పదాలతో పనికిమాలిన వ్యాఖ్యలు చేయడం సరికాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దక్షిణాది వ్యక్తి అని గుర్తుచేస్తూ, నిజంగా సమస్య ఉంటే ఆమె దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరవచ్చని సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా బండి సంజయ్ కరీంనగర్‌లో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, స్థానిక బీజేపీ నేతలతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, "తెలంగాణ ఉద్యమ పతాకం, చేనేత సహకారోద్యమ నేత, భరతమాత ఒంటిపై మెరిసే చేనేత వస్త్రం, నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబావుటా, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక ఈ అన్నింటికీ ప్రతిరూపం కొండా లక్ష్మణ్ బాపూజీ" అని అన్నారు. బాపూజీ జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన చేసిన త్యాగాలను, పోరాటాలను, ప్రజాస్వామ్య సేవలను వివరించారు. "తన ఇంటినే టీఆర్ఎస్ ఆఫీస్‌గా మార్చి తెలంగాణ రాష్ట్రానికి అంకురార్పణ చేసిన మహనీయుడు. గాంధీ టోపీ ధరించి 'సిటిజన్ ప్రొటెక్షన్ కమిటీ' ద్వారా పౌర హక్కుల కోసం పోరాడిన యోధుడు. నిజాం పాలనపై వ్యూహాత్మకంగా బాంబు దాడి చేసిన ధైర్యవంతుడు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించాలన్న లక్ష్యంతో జీవితాంతం పోరాడిన నాయకుడు" అని కొనియాడారు. "96 ఏళ్ల వయస్సులో కూడా ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో తెలంగాణ కోసం దీక్ష చేసిన బాపూజీ, నేటి తరానికి ఆదర్శం. ఆయన విలువలు, త్యాగం, పట్టుదల, నిజాయితీ, పోరాట స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి, "కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి, వర్ధంతిని అధికారికంగా ఊరూవాడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. ఆయన కలలు కన్న గ్రామ స్వరాజ్య తెలంగాణను సాధించాలి" అని సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని, జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. "ఇడ్లీ, దోశ, వడ అంటూ దక్షిణ -ఉత్తర అనే తేడాలు చూపడం పనికిమాలిన పని. సమస్య ఉంటే నిర్మలా సీతారామన్ గారితో మాట్లాడి పరిష్కారం కోరాలి. అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# ఏఐటీయుసి పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

**కార్మికుల ధర్నా ప్రభుత్వాన్ని కదిలించింది**




**రామగుండం, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న చరిత్ర కలిగిన ఏఐటియుసి యూనియన్‌పై ఇటీవల కొన్ని కార్మిక సంఘాలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటియుసి, కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి మూడు స్ట్రక్చర్ సమావేశాల్లో 28 డిమాండ్లు చర్చకు తీసుకురాగా, 14 డిమాండ్లను యాజమాన్యం అంగీకరించినప్పటికీ వాటి అమలుపై నిర్లక్ష్యం చూపడంతో సెప్టెంబర్ 12న హైదరాబాద్‌లో జరిగిన సమావేశాన్ని ఏఐటియుసి బహిష్కరించింది.
ఈ పరిణామాన్ని వక్రీకరించి, పాత ఫోటోలు పెట్టి, ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉన్నారని ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తూ, ఏఐటియుసి కార్మికులను మోసం చేస్తోందని హెచ్ఎంఎస్ యూనియన్ ఆరోపించడం సిగ్గుచేటు అని ఏఐటియుసి నేతలు మండిపడ్డారు. గోదావరిఖని ఓసిపి -5లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం మాట్లాడుతూ, కార్మికుల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అవగాహన లేని సంఘాలు మాయమాటలతో పబ్బం గడుపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 19న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల వద్ద యాజమాన్య మొండివైఖరికి నిరసనగా ధర్నాలు నిర్వహించగా, ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల సమస్యలపై వినతిపత్రం స్వీకరించారని ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఈ ధర్నా విజయవంతం కావడంతో రేపు ముఖ్యమంత్రి సింగరేణి కార్మికులకు రావాల్సిన ఆర్థిక లాభాలపై ప్రకటన చేయనున్నారని ఆయన వెల్లడించారు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడేది ఏఐటియుసి మాత్రమేనని, కార్మికులు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా సంఘం పక్షాన నిలవాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాదన మహేష్, రంగు శ్రీను, గుర్రం ప్రభుదాస్, బోగ సతీష్ బాబు, ఎం. చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం సహాయ నిధి

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**


**- డెప్యూటీ సీఎం మల్లు భట్టి కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే**



**భూపాలపల్లి, సెప్టెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)** భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్ళపల్లి, శాయంపేట మండలాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో సీఎం సహాయ నిధి ద్వారా పేద, నిరుపేదలకు ఆర్థిక అండను అందిస్తూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని 69 మంది లబ్ధిదారులకు రూ. 16.50 లక్షల చెక్కులు మొగుళ్ళపల్లి రైతు వేదికలో, 49 మందికి రూ. 15.58 లక్షల చెక్కులు శాయంపేట మండల కేంద్రంలో అందజేశారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజలను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, మానవతా దృక్పథంతో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయం మంజూరవుతోందని పేర్కొన్నారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. శాయంపేట మండలంలోని మారపెల్లి గ్రామానికి చెందిన ప్రమీల ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆమె దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదే రోజు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కాకతీయ నృత్య నాటకోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఆయనకు పూల బొకే ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికిన గౌరవం కూడా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకే దక్కింది.

# గణేష్ నగర్‌లో ఎంగిలిపూల బతుకమ్మకు వైభవం





**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బతుకమ్మ పండుగ తొలి రోజు కరీంనగర్ గణేష్ నగర్ కాలనీలో ఎంగిలిపూల బతుకమ్మను చిన్నా -పెద్ద తేడా లేకుండా మహిళలు ఘనంగా జరిపారు. సంప్రదాయ చీరలలో మెరిసిపోతూ, కోలాటాలతో, బతుకమ్మ పాటలతో ఆడి పాడి పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. గణేష్ సేవా యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం కాలనీలో సాంస్కృతిక ఉత్సాహాన్ని నింపింది.

# తెలంగాణ బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవం

**-ఇందిరాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి**

**- మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్, సుభాష్ నాయక్,**




**మేడ్చల్ సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ప్రధానమంత్రి, స్వర్గీయ ఇందిరాగాంధీ బంజారాలకు ఎస్ టి రిజర్వేషన్లు ఇచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బంజారా భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖులు, ముఖ్య అతిధులు మరియు బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సుమన్ నాయక్, పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ సుమన్ నాయక్, పాల్గొని నెక్లెస్ రోడ్లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## బాలికల పాఠశాల పనులు ప్రారంభించారు కానీ పూర్తి చేయడం మర్చిపోయారు



**తెలకపల్లి, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న బాలికల ప్రాథమిక పాఠశాల గత కొద్ది సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉంది. ఎన్నో విద్యార్థినులు ఈ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలకు చేరినప్పటికీ, నేడు ఆ పాఠశాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. 2022లో అప్పటి ప్రభుత్వం రూ.76 లక్షల అంచనా వ్యయంతో రెండు అంతస్తుల నూతన భవనానికి శిలాఫలకం వేసి పనులు ప్రారంభించినా, నిర్మాణం అసంపూర్ణంగా నిలిచిపోయింది. ప్రస్తుతం విద్యార్థినీలను సమీపంలోని హరిజన చేరి పాఠశాలకు మార్చడం జరిగింది. పాత భవనం శిథిలంగా ఉండటంతో, నిర్మాణం నిలిచిపోయిన ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వాలు మారినా, ఈ నిర్మాణం పూర్తి కావడం లేదు. గ్రామ పెద్దలు, యువకులు సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటూ, ఈ ఏకైక బాలికల పాఠశాల భవనాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించి విద్యార్థినులకు సురక్షిత విద్యావాతావరణం కల్పించాలని కోరుతున్నారు.

## నిస్వార్థ సేవకు నిఫా 2025 రాష్ట్రీయ అవార్డు

### చందనగిరి ప్రమీలకు అరుదైన గౌరవం




**ఎన్టిపిసి, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీకి చెందిన సమతా ఫౌండేషన్, సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు, టీచర్ చందనగిరి ప్రమీల నిస్వార్థ సేవకు దేశస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ & యాక్టివిట్స్ (నిఫా) 25వ రజతోత్సవ వేడుకల్లో ఆమెకు నిఫా 2025 రాష్ట్ర అవార్డు మరియు రూ.10,000 నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ అవార్డును నిఫా ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రిత్పాల్ సింగ్ పన్ను, ఉత్తరప్రదేశ్ అధ్యక్షులు దిలీప్ కుమార్, అమిత్ గుప్తా లు అందజేశారు. నిఫా సంస్థ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ మాసంలో యువజన, కళా, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందించిన వ్యక్తులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్కరిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 48 మంది సేవాకర్తలను ఎంపిక చేయగా, తెలంగాణ నుంచి ఇద్దరికి ఈ గౌరవం దక్కింది. అందులో చందనగిరి ప్రమీలకు ఈ అవార్డు ఆమె అంకితభావం, ఆదర్శప్రాయమైన సేవ, సమాజానికి అందించిన విలువైన సహకారం, అవిశ్రాంత కృషికి గుర్తింపుగా అందించారని పేర్కొన్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం చందనగిరి ప్రమీల మాట్లాడుతూ, ఈ గౌరవంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, సామాజిక సేవలో శక్తివంచన లేకుండా ముందుండేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ విజయానికి తన భర్త దుర్గం నగేష్ ఎల్లప్పుడూ తోడుగా నిలుస్తున్నారని, అవార్డు ఎంపికకు సహకరించిన సామాజిక సేవకులు యాదవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

# తంగేడు పువ్వు తెలంగాణ జీవన సంస్కృతికి ప్రతీక





బతుకమ్మ పండుగ నవ్వుల మధ్య సాగే జీవన యాత్రకు ప్రకృతి పూజగా నిలిచే తెలంగాణ ప్రత్యేక పర్వదినం. కోపం, ద్వేషం, అసూయ వంటి భావాలను వదిలి, నవ్వుతూ జీవించమని ఈ పండుగ మనకు సందేశం ఇస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ మహిళలు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటూ, తమ మూలాలను గౌరవంగా గుర్తుచేసుకుంటున్నారు.ఈ పండుగలో తంగేడు పువ్వుకు ప్రత్యేక స్థానం ఉంది. ఇది కేవలం ఒక పూవు కాదుతెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానానికి ప్రతీక. గ్రామాల్లో, పొలాల్లో, అడవుల్లో విరివిగా లభించే ఈ పువ్వు లేకుండా బతుకమ్మను అసంపూర్ణంగా భావిస్తారు. తంగేడు పువ్వుతో అలంకరించిన బతుకమ్మ ప్రకృతికి మన కృతజ్ఞతగా నిలుస్తుంది.ఆయుర్వేదంలో తంగేడు పువ్వు డయాబెటిస్, చర్మ వ్యాధులు, మూత్రపిండాల సమస్యలకు ఉపయోగపడుతుంది. యాంటీఆక్సిడెంట్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలతో శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. కరువును తట్టుకొని పెరిగే ఈ మొక్క నేల క్షీణతను నివారించి పర్యావరణ సమతుల్యతకు తోడ్పడుతుంది.
బతుకమ్మ పండుగలో తంగేడు పువ్వు మన ఆరోగ్యం, పవిత్రత, ప్రకృతి ప్రేమకు ప్రతినిధిగా నిలుస్తుంది. ఇది మన తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పుష్పం. ఈ పండుగ సందర్భంగా ప్రతి కుటుంబానికి, ప్రతి తెలంగాణ హృదయానికి శుభాకాంక్షలు.

వ్యాసకర్త
**కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి, usa -న్యూయార్క్**



# ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ






- **-వర్షంలో కూడా బతుకమ్మలాడుతున్న మహిళలు**
- **-తీరొక్క పూలతో పూజలు**
- **-బతుకమ్మ పాటలతో హోరెత్తిన గ్రామాలు**
- **-ఉత్సాహంగా పాల్గొన్న యువతులు, మహిళలు**

**యాచారం,సెప్టెంబర్ 21( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచమంతా పూలతో పూజిస్తే.. పూలనే పూజించే గొప్ప సంస్కృతి మనది. ప్రకృతిని ఆరాధించే మహోన్నత వారసత్వానికి ప్రతీక మన బతుకమ్మ పండుగ. అమావాస్య మొదలు దుర్గాష్టమి వరకు జరిగే మహోన్నత వేడుక. మొదటి రోజైన అమావాస్య నాడు 'ఎంగిలిపూల' బతుకమ్మను పేరుస్తారు. యాచారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎంగిలిపూల' బతుకమ్మ వేడుకలు' ఘనంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు వేడుకల్లో భాగంగా తంగేడు, గునుగు, బంతి, పట్నం బంతి, పట్టుకుచ్చు, తామర పువ్వు, గుమ్మడి పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించారు.మహిళలు ఒకచోట చేరి 'ఒక్కేసి పువ్వేసి సందమామ ఒక్క జాములో సందమామ, 'చిత్తు చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మా.. అందాల బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన' అంటూ బతుకమ్మ పాటలతో హోరెత్తించారు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ముగిసిన అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు . బతుకమ్మ వేడుకల్లో యాచారం మరియు హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

### స్పోర్ట్ చైర్మన్ శివసేనారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి



**వనపర్తి, సెప్టెంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు.వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన 11వ అంతర్‌జిల్లా సీనియర్ మెన్స్ &ఉమెన్స్ సెపక్ తాక్రా చాంపియన్షిప్ ప్రారంభోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించి, క్రీడాజ్యోతి వెలిగించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.వసేనారెడ్డి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించిందని, వనపర్తిలో 57 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్, త్వరలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ స్థాయిలో మైదానాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి విద్యాకేంద్రం మాత్రమే కాక క్రీడలకు కూడా నిలయమని, క్రీడాకారులు రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. సెపక్ తాక్రా క్రీడల్లో రాణించి ఉద్యోగం పొందిన నవతను అభినందించారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా క్రీడాధికారి సుధీర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు నిత్యవసర సరుకులు వితరణం



**వనపర్తి,సెప్టెంబర్ 21( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవం,బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు, అలంపూర్ మాజీ శాసనసభ్యుడు డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి జన్మదినం సందర్భంగా సేవ పక్షం 2025 కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని చాముండేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచితంగా ఒక నెలకు సరిపడే కిరాణా సామాగ్రి పంపిణీ చేపట్టారు.మహబూబ్ నగర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, కొత్తకోట మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్ము భరత్ భూషణ్ చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకురాలు వెంకటేశ్వరమ్మ, వృద్ధాశ్రమంలోని వృద్ధుల తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వృద్ధాశ్రమం నడపడానికి అందుతున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వనపర్తి యువమోర్చా నాయకుడు రాము, కొత్తకోట యువమోర్చా నాయకుడు కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా అప్రమత్తంగా ఉండండి

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్



**కరీంనగర్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊళ్లకు వెళ్లే సందర్భాలు ఎక్కువగా ఉంటాయని, ఈ సమయంలో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఊరెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం, ఇంటిపై నిఘా ఉంచమని పొరుగువారికి చెప్పడం, బంగారం, డబ్బును ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్‌లో భద్రపరచడం వంటి సూచనలు చేశారు. అలాగే, సోషల్ మీడియాలో ఊరెళ్తున్న విషయాన్ని పోస్ట్ చేయకుండా ఉండాలని, ఇంట్లో లైట్లు వేసి ఉంచడం, తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ వేయడం వంటి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలను నిరోధించవచ్చని, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు ఈ విషయంలో సహకరించాలని కోరారు. పేపర్లు, పూల మొక్కలు అమ్మేవారి రూపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచి, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని, నకిలీ ఆఫర్లు, అనుమానాస్పద లింకులు తెరవకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఒకవేళ మోసానికి గురైతే 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అత్యవసర సహాయం కోసం 1930 (సైబర్ నేరాల హెల్ప్‌లైన్), 112, 100 నంబర్లను ఉపయోగించవచ్చని, ఆన్‌లైన్ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే, చోరీలను నియంత్రించడం సులభమవుతుందని పేర్కొంటూ, సురక్షితంగా పండుగ జరుపుకోవాలని కరీంనగర్ పోలీసులు కోరారు.

# జీవో 99పై మాల సంఘాల ఆందోళన

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వినతిపత్రం



**మేడిపల్లి/బోడుప్పల్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 40 లక్షల మాల కులస్తులకు జరుగుతున్న అన్యాయంపై మాల సంఘాల నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణలో జీవో నెంబర్ 99 ద్వారా మాల జాతిని అణచివేయాలనే కుట్ర జరుగుతోందని, ఎస్సీ కులాల్లో 59 ఉండగా 58 కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆరోపించారు. గ్రూప్-3లో మాల ఉపకులాలకు 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం వల్ల విద్యా, ఉద్యోగ అవకాశాలు దూరమవుతున్నాయని, ఉన్నవారికి ప్రమోషన్లు రాకుండా నిర్లక్ష్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ (బాలన్న గ్రేటర్), ఉమ్మడి రంగారెడ్డి మాల సంఘాల నేతలు కలిసి ఎల్బీనగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డిని కలిసి జీవో 99 సవరణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని శాసనసభలో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కనివేట నర్సింగ్ రావు, మాస శేఖర్, కొండ్ర లింగస్వామి, అనుముల వీర, దేవుళ్ళ పురుషోత్తం, మాస దామోదర్, మహేందర్, నాలుకల నర్సింగరావు, రెడ్డి మల్ల పెద్ద కృష్ణ, జంగ్లీ కిషన్, సంతోష్, కిషోర్, కొప్పుల అర్జున్ తదితరులు పాల్గొన్నారు. మాల సంఘాలు అన్ని రాజకీయ పార్టీలను కలుసుకుని తమ హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజలకున్యాయం కోసం పోరాడేదే ఎర్రజెండా-రమేశ్




**వనపర్తి,సెప్టెంబర్ 21( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** అణగారిన ప్రజలకు న్యాయం కోసం పోరాడేదే ఎర్రజెండా అని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. ఆదివారం పంజాబ్ రాష్ట్రం చండీగర్లో ఈరోజుసిపిఐ 25వ జాతీయ మహాసభల ప్రారంభం సందర్భంగా వనపర్తి సిపిఐ ఆఫీస్ వద్ద సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావ సమావేశం నిర్వహించారు. సంఘీభావం తెలుపుతూ ఆఫీస్ వద్ద అరుణ పతాకాన్ని జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాజీ సర్పంచ్ కళావతమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో సిపిఐ కి వందేళ్ళ పోరాట చరిత్ర ఉందని, మరే పార్టీకి లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ సాధన పోరాటంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందన్నారు. దున్నేవాడికి భూమి, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రుణమాఫీ, న్యాయమైన కూలి రైతుకు గిట్టుబాటు ధర నిరుద్యోగులకు ఉద్యోగం ఉపాధి కోసం పోరాడుతూ పేదల గొంతుకగా పనిచేస్తోందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలోపేదల కోసం చేసిందేమి లేకపోగా వారి హక్కులను హరించిందన్నారు. లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులను, నల్ల సాగు చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బందులు పాలు చేసిందన్నారు. ఇప్పుడు రైతులకు యూరియా ఇవ్వకుండా వేధిస్తోందన్నారు. పేదరికం నిరుద్యోగంతో ప్రజలు అల్లాడుతుంటే గుడుల పేరుతో మతం పేరుతో రాజకీయం చేస్తోందని ప్రజలు సంఘటితమై తిప్పి కొట్టాలన్నారు. వందేళ్ళపోరాట చరిత్ర కలిగిన సిపిఐ బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతోందని ప్రజలు కలిసి రావాలని కోరారు. సిపిఐ 25వ జాతీయ మహాసభల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకులపై పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ,కృష్ణవేణి, గోపాలకృష్ణ,జయమ్మ,చిన్న కుర్మయ్య,లక్ష్మీనారాయణ, శివ,వంశీ,శిరీష,శ్రీదేవి,భూమిక, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్








**హుస్నాబాద్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మను ఆడుతున్న ఆడపడుచులకు, తెలంగాణ అక్కాచెల్లెమ్మలందరికీ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, “బతుకమ్మ పండుగలో ప్రతి మహిళ నవ్వుతూ, ఆనందంగా పాల్గొనాలి. 9 రోజుల పాటు జరిగే ఈ పండుగకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజలు పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను” అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా హుస్నాబాద్ ప్రజలందరికీ శుభం జరగాలని కోరుతూ, మంత్రి పొన్నం ప్రభాకర్ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పూల పరిమళాలతో, పాటల గానంతో హుస్నాబాద్ వీధులు ఉత్సాహంగా మారాయి.

# ఈసారి శీతాకాలం భారత్‌లో పంజా విసరనున్న చలి..!



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** త్వరలోనే శీతాకాలం ప్రారంభం కానున్నది. ఈ ఏడాది వర్షాలు భారీగా కురిశాయి. దాంతో ఈ ఏడాది శీతాకాలంలో చలి బాగా ఉంటుందా? అన్న చర్చ సాగుతుంది. లా నినా పరిస్థితులు ఏర్పడడంతో శీతాకాలంపై ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. లా నినా చల్లటి వాతావరణాన్ని సూచిస్తుందని.. లా నినా ఎల్ నినోకు వ్యతిరేకమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. లా నినా కారణంగా భారత్‌లో.. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఎక్కువగా చలి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం కారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో ఉత్తరభారతంలో మరింత మంచు కురుస్తుందని.. చలిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. యూఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ వాతావరణ అంచనా కేంద్రం అక్టోబర్, డిసెంబర్ మధ్య లా నినా అభివృద్ధి చెందే అవకాశం 71 శాతం ఉంటుందని అంచనా వేసింది. ప్రపంచ వాతావరణ సంస్థ సెప్టెంబర్ ప్రారంభంలో లా నినా దృగ్విషయాన్ని ప్రకటించింది. తాత్కాలిక శీతల ప్రభావం ఉన్నప్పటికీ చాలా దేశాలలో ప్రపంచ ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా ఉంటాయని సంస్థ అంచనా వేసింది. భారత్‌లో భారీ వర్షాలు కురిశాయని.. ఈ క్రమంలో ప్రజలు తీవ్రమైన చలిని ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. పసిఫిక్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ ల్యాబ్ ప్రకారం.. లా నినా భూమధ్యరేఖ పసిఫిక్‌లో అసాధారణంగా చల్లని సముద్ర ఉష్ణోగ్రతల ద్వారా వర్గీకరించబడుతుందని.. అయితే ఎల్ నినో భూమధ్యరేఖ పసిఫిక్‌లో అసాధారణంగా వెచ్చని సముద్ర ఉష్ణోగ్రతల ద్వారా వర్గీకరిస్తారన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో కాలానుగుణ నమూనా అయిన లా నినా, భూమధ్యరేఖ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే తగ్గడానికి కారణమవుతుందని.. భారత్ భూమధ్యరేఖకు సమీపంలో ఉన్న లా నినా ప్రభావితమైన దేశమని.. లా నినా ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల్లో తీవ్రమైన చలిని కలిగిస్తుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

# రాజీవ్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో అంగరంగ వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ



**బోడుప్పల్, సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బతుకమ్మ పండుగ సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్‌లోని రాజీవ్ నగర్ డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఆధ్వర్యంలో ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ చీరలలో మెరిసిపోతూ, పూలతో అలంకరించిన బతుకమ్మలను మధ్యలో పెట్టి మహిళలు కోలాటాలతో, పాటలతో పండుగను ఉత్సాహంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ శ్రీమతి దానగళ్ల అనిత యాదగిరి మాట్లాడుతూ, “తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా పూలతో జరుపుకునే ఏకైక పండుగ బతుకమ్మ. ఇది మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు ప్రతీక” అని పేర్కొన్నారు. వేడుకల్లో డివిజన్ అధ్యక్షులు గోపురాములు, కాలనీ ఉపాధ్యక్షులు నానాజీ, అధ్యక్షులు చిప్పల శ్రీధర్, గౌరవ అధ్యక్షులు అన్నందాసు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి తుక్కోజి అమరేందర్, కోశాధికారి కిలారి అశోక్, బ్లాక్ ఇంచార్జ్‌లు వెంకటేష్ ముదిరాజ్, గొరిగే సంతోష్ కుమార్, ముఖ్య సలాహదారులు రాజగోపాల్, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా మహిళల ఉత్సాహం, సమైక్యత రాజీవ్ నగర్ వీధులను పూల పరిమళాలతో నింపింది.

# శత్రువులపై చర్యలు తీసుకోవాలి’..

రహస్య మెసేజ్‌ను పొరపాటున ఆన్‌లైన్‌లో పెట్టిన ట్రంప్..!




**న్యూఢిల్లీ సెప్టెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రాజకీయ శత్రువులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని.. అటార్నీ జనరల్ పామ్ బోండీ కి సూచించారు. ఈ మేరకు ఆయన ఆన్‌లైన్‌లో ఒక మెసేజ్ పెట్టారు. అయితే ఆ మెసేజ్‌ను ఆయన బోండీకి వ్యక్తిగతంగా పెట్టబోయి, పొరపాటున ఆన్‌లైన్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పోస్టుపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. అసలేం జరిగిందంటే.. తన రాజకీయ శత్రువులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అటార్నీ జనరల్ పామ్ బోండీకి ట్రంప్ సూచన చేయదలిచారు. అందులో భాగంగా ‘మనం ఇక ఆలస్యం చేయలేం. ఇది మన కీర్తి, విశ్వసనీయతను చంపేస్తుంది. వారు నన్ను రెండుసార్లు అభిశంసించారు. అభియోగాలు మోపారు. న్యాయం జరగాల్సిన సమయం వచ్చింది’ అని మెసేజ్ చేశారు. మాజీ ఎఫ్‌బీఐ డైరెక్టర్ జేమ్స్ కోమీ, కాలిఫోర్నియా డెమోక్రటిక్ సెనెటర్ ఆడమ్ షిఫ్, న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్‌ను ఉద్దేశిస్తూ ఆయన ఆ పోస్టు పెట్టారు. ఎందుకంటే కొంతకాలంగా వారితో ట్రంప్‌కు వైరం నడుస్తోంది. ఈ క్రమంలో వారిపై చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే ట్రంప్ ఈ పోస్టు పెట్టినట్లు తెలుస్తోంది. ట్రంప్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బోండీకి వ్యక్తిగతంగా మెసేజ్ పెట్టబోయి ట్రంప్ ఆన్‌లైన్‌లో పెట్టి ఉంటారని నెటిజన్‌లు కామెంట్స్ పెడుతున్నారు. అయితే దీని గురించి అమెరికా అధికారులు స్పందించలేదు.




# ఓజీ' ట్రైలర్ విడుదల వాయిదా..

## ఎప్పుడంటే.!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ 'ఓజీ' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా రిలీజ్‌కు ఇంకా ఐదు రోజులు మాత్రమే ఉండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే ఈరోజు ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ట్రైలర్‌ను కొన్ని గంటలు వాయిదా వేసినట్లు తెలిపింది. ఈ మూవీ ట్రైలర్‌ను నేడు సాయంత్రం జరిగే 'ఓజీ' కాన్సర్ట్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సెప్టెంబర్ 21న సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 'ఓజీ' కాన్సర్ట్‌ను నిర్వహించబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ కార్యక్రమం ప్రధానంగా పాటల విడుదల వేడుకగా భావిస్తున్నారు. ఈవెంట్‌కు పవన్ కల్యాణ్ హాజరవుతారా లేదా అనే దానిపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. అయితే చిత్ర యూనిట్‌లోని మిగతా సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. పవన్ రాకపై క్లారిటీ వస్తే ఈ కాన్సర్ట్ మరింత గ్రాండ్‌గా మారే అవకాశం ఉంది.



# 600 మంది డ్యాన్సర్లతో 'అఖండ' మాస్ సాంగ్

నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అఖండ 2' (తాండవం). బ్లాక్ బస్టర్ సినిమా 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్ అనంతరం జార్జియాలో కూడా పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించింది. అయితే తాజాగా రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక ఎపిసోడ్‌లను చిత్రీకరిస్తుంది చిత్రయూనిట్. అయితే ఫిల్మ్ సిటీలో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణతో బోయపాటి ఒక మాస్ సాంగ్‌ను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దాదాపు 600 మంది డ్యాన్సర్ల ఈ సాంగ్‌లో బాలయ్యతో కలిసి డ్యాన్స్ చేయబోతున్నారు. భాను నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పకులు. సంయుక్త కథానాయికగా నటిస్తుండగా.. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు.




# ఓటీటీలోకి ఫహాద్ ఫాజిల్ కొత్త మూవీ..

## స్ట్రీమింగ్ ఎక్కడంటే.!

మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన రొమాంటిక్ కామెడీ మూవీ 'ఓడుం కుతిర చాదుం కుతిర' . ఈ సినిమాలో కొత్త లోకతో సూపర్ హిట్ అందుకున్న ల్యాణి ప్రియదర్శన్, రేవతి పిళ్లై కథానాయికలుగా నటించారు. ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి హిట్ అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాను ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్' లో ఈ నెల 26 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది.



# సుకుమార్ దర్శకత్వంలో రెండోసారి?

సుకుమార్ కొత్త సినిమా అంటే టెక్నికల్ టీమ్‌ను ఎంచుకోవడం పెద్ద పనేం కాదు. వారెప్పుడూ ఆయనకు సిద్ధంగానే ఉంటారు. ఆర్టిస్టుల ఎంపికే సుకుమార్‌కి పెద్ద పని. 'పుష్ప 2' తర్వాత ఆయన రామ్‌చరణ్‌తో సినిమా చేయనున్నారు. కథను కూడా లాక్ చేసేశారు. ఈ కథలో హీరోయిన్ పాత్ర కీలకమని సమాచారం. ఆ పాత్ర కోసం కృతీ సనన్‌ను తీసుకోవాలనుకుంటున్నారట సుకుమార్. తన కథలో నాయిక పాత్రకు కృతి సనన్ సరిగ్గా సరిపోతుందని సుకుమార్ భావించారట.సాధారణంగా కథానాయికను ఆడిషన్, ఫొటో షూట్ చేసి తీసుకోవడం సుకుమార్ ఆనవాయితీ. కృతీ సనన్ అయితే అలాంటి అవసరం లేకుండానే, నిస్సంకోచంగా తీసుకోవచ్చని సుకుమార్ భావిస్తున్నారట. ఇప్పటికే సుకుమార్‌తో పనిచేసిన అనుభవం కృతి సనన్‌కి ఉంది. మహేశ్ 'వన్' సినిమాలో ఆమే కథానాయిక. ఈ సినిమా ఖరారైతే సుకుమార్ డైరెక్షన్‌లో రెండోసారి నటించినట్టవుతుంది.

# హృతిక్‌తో నేషనల్ క్రష్..



హృతిక్ రోషన్ కథానాయకుడిగా తెరకెక్కిన 'క్రిష్' చిత్రానికి మరో సీక్వెల్ రాబోతుంది. ఇప్పటికే ఈ చిత్రం మూడు పార్టులుగా ప్రేక్షకుల ముందుకొచ్చి విజయం సాధించాయి. ఇప్పుడు క్రిష్-4 కూడా రానున్నట్లు రాకేశ్ రోషన్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికో విశేషం ఉంది. ఇందులో హృతిక్ రోషన్ హీరోగా నటించడమే కాకుండా స్వయంగా ఆయనే దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. దర్శకుడిగా హృతిక్‌కు తొలి చిత్రమిది. వచ్చే ఏడాది ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు కథానాయిక కోసం వేట మొదలుపెట్టారు మేకర్స్. అయితే ఈ చిత్రం కోసం నేషనల్ క్రష్ రష్మిక మందన్నాను సంప్రదించినట్లు, ఆమె అంగీకారం తెలిపినట్లు బాలీవుడ్ మీడియా చెబుతోంది. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది చిత్రీకరణను మొదలుపెడతామని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రాకేశ్ రోషన్ తెలిపారు. 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి రష్మిక ఈ చిత్రంలో ఉందో లేదో తెలియాలంటే కాస్త వేచి చూడాల్సిందే!

# ధనుష్ 'ఇడ్లీ కొట్టు' ట్రైలర్ విడుదల




తమిళ అగ్ర హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో నటించి, ఆకాష్ భాస్కరన్‌తో కలిసి నిర్మించిన తమిళ సినిమా 'ఇడ్లీ కడై'. ఈ సినిమా.. 'ఇడ్లీ కొట్టు' పేరుతో అక్టోబర్ 1న తెలుగులో విడుదల కానుంది. శ్రీ వేదక్షర మూవీస్ పతాకంపై నిర్మాత రామారావు చింతపల్లి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. దర్శకుడిగా ధనుష్ నాలుగో సినిమా ఇది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'మిషన్లతో అన్నీ చేసేయొచ్చు అంటారు కానీ రుచి అనేది మాత్రం.. మనసు పెడితేనే వస్తుంది. జీవితంలో మనం చేసే పనిని ఆదాయం కోసం మాత్రమే కాదు. ఆస్వాదిస్తూ కూడా చేయాలంటూ వచ్చే డైలాగ్‌లు ఈ ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి. ధనుష్ ఈ సినిమాలో చెఫ్ పాత్రలో కనిపించబోతున్నాడు. నిత్యామీనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కిరణ్ కౌశిక్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్